పవిత్రమౌతాడని చదివాను. కానీ అదంతా ఊహతో కూడిన కల్పన తప్ప అందులో నిజం ఎక్కడుంది?'' అడిగాడా అమెరికన్ సీరియస్‌గా.

స్వామీజీ చిన్నగా నవ్వి లేచి చెప్పాడా అమెరికన్‌తో.

''అలా నదివద్దకి వెళ్ళి మాట్లాడుకుందాం పద.''

ఇద్దరూ నది ఒడ్డుకి వెళ్ళారు. అక్కడ కొందరు జాలర్లు నదిలో చేపలు పడుతున్నారు. నీళ్ళల్లో నిలబడి వలని దూరంగా విసురుతున్నారు. వలలో చేపలు పడ్డాక, వాటిని పట్టుకుని బుట్టలో వేసుకుని మళ్ళీ వలని దూరంగా విసురుతున్నారు.

''జాలర్ల వలలో ఏ చేపలు పడుతున్నాయి? వారి పాదాల వద్ద ఉన్నవా? లేక దూరంగా వున్న చేపలా?'' ప్రశ్నించాడు స్వామీజీ.

''దూరంగా ఉన్నవే.'' చెప్పాడు అమెరికన్ వినమ్రంగా.

''భగవంతుడు ఆ జాలరి వంటివాడు. అతని చేతిలోని వల మాయ. దేవుడు విసిరేవలలో గురు పాదాలను ఆశ్రయించిన చేపలు అనే శిష్యులైన భక్తులు మాయకి చిక్కరు. దాంతో మోక్షాన్ని పొందుతారు. గురు పాదాలను ఆశ్రయించకుండా, వాటికి దూరంగా వుండే జీవులు మాయలో చిక్కుకుని జనన మరణ చక్రంలో పడి కొట్టుకుంటూంటారు.'' స్వామీజీ చెప్పాడు.

గురువు పాదాలను శిష్యులు ఆశ్రయించడంలోని మర్మం ఆ అమెరికన్‌కి అప్పుడు చక్కగా అర్థమైంది.

## 32. మన మంచికే

చిన్నతనం నించి దైవభక్తికి అలవాటుపడిన ఓ వ్యక్తి తన సంసార జీవనంలో వచ్చే చిక్కులు తొలగించమని, తనకి కావలసింది ఇవ్వమని తరచు దేవుడ్ని ప్రార్థించసాగాడు. ఐతే అతని కోరికలలో కొన్ని తీరేవి. కొన్ని చిన్నవైనా తీరేవి కావు. 'దేవుడు ఎందుకిలా చేస్తున్నాడు?' అన్న ఆలోచన

అతన్ని ఎప్పుడూ వెంటాడేది. ఆ ప్రశ్నకి అతనికి రకరకాల సమాధానాలు తట్టాయి. అన్నీ తీరిస్తే తనని మర్చిపోతాడనా?

తనలో భక్తి కేవలం కొన్ని కోరికలు తీరేంత మాత్రమే వుందా?

లేదా కొన్నిటిని బాగా భక్తిగా కోరుకుని, మరి కొన్నిటిని తక్కువ భక్తితో కోరుకుంటున్నాడా? అతనికి ఆ ప్రశ్నలకి సరైన సమాధానం దొరకలేదు. దేవుడే దానికి జవాబు చెప్పాలని నిశ్చయించుకున్నాడు.

తన కోరికలు కొన్ని తీర్చి మరికొన్నింటిని ఎందుకు తీర్చడం లేదో మర్నాటి సూర్యోదయంలోగా తెలియచేయమని ఓ రోజు ఆ దేవుడినే భక్తి పూర్వకంగా ప్రార్థించాడు.

ఆ రోజు అతను తనింట్లో జరిగిన రెండు విశేషాలు గమనించాడు. అతని పెద్ద కూతురికి జ్వరం వచ్చి తగ్గింది. కానీ చిన్న కూతురికి వచ్చిన జ్వరం తగ్గలేదు. చిన్నపాప అన్నం పెట్టమని ఎంతగా ఏడ్చినా పెట్టకుండా అతని భార్య పథ్యం చేయించి, ఆయుర్వేద మందు వేసింది. జ్వరం తగ్గిన పెద్ద కూతురు ఆకలి లేదని ఎంత మొత్తుకున్నా వినకుండా బలవంతంగా వేడి వేడి అన్నంలో కారప్పొడి కలిపి ముద్దలు చేసి తన భార్య దానికి తినిపించడం చూసాడతను.

వెంటనే అతను భార్యని పిలిచి అడిగాడు.

"చిన్నమ్మాయి అడిగినా పెట్టకుండా, పెద్దదానికి మాత్రం వద్దన్నా బలవంతాన అన్నం పెడుతున్నావు. ఎందుకిలా చేస్తున్నావు?"

"చిన్నదానికి జ్వరం. అన్నం తినడం దానికి అపకారం చేస్తుంది. కాబట్టి దానికి తినాలని ఎంత కోరికగా వున్నా పెట్టలేదు. పెద్దదానికి జ్వరం తగ్గింది కదా అని బలవంతంగా తినిపించాను. జ్వరంతో నాలుకకి చవి చచ్చిపోయి తినబుద్ధి కాదు. కానీ తింటేనేగా దానికి బలం?"

అప్పుడతనికి అసలు విషయం బోధ పడింది.

దేవుడు తన కోరికలలో కొన్నింటిని మాత్రమే తీర్చి, మరి కొన్నిటిని ఎందుకు తీర్చడం లేదో తెలిసింది. తనకి హాని చేసే కోరికలు తను కోరినా దేవుడు తీర్చడన్నమాట. అలా అని తనకి మేలు చేసేవి వద్దన్నా, తీర్చకుండా వుండడు. ఇదంతా తన మంచికే. ఎన్నోసార్లు పిల్లలకి జ్వరం వచ్చినప్పుడు ఇంట్లో జరిగే ఆ తంతు చూస్తున్నా తనకి పూర్వం ఈ సమాధానం స్ఫురించలేదు. ఇప్పుడు స్ఫురించడానికి కారణం దేవుడు తన దృక్కోణం మార్చడమే అని గ్రహించాడు.

తనకి జ్ఞానోదయాన్ని కలిగించిన భగవంతునికి అతడు కృతజ్ఞతగా నమస్కరించాడు.

## 33. వాయిదా వేయకూడనిది

ఓ ఊళ్ళో ఒక భక్తుడికి ఇద్దరు కొడుకులున్నారు. వారు కవలలు. చెడు పనులు చేయకపోతే భగవంతుని పూలతో పూజించినట్లేనని, మంచి పనులు చేస్తే స్వామికి చక్కటి నైవేద్యం అర్పించినట్లని చిన్నప్పటినించీ తండ్రి వాళ్ళకి బోధించేవాడు. వీటిని నిత్యం పాటిస్తే అంతకు మించి దైవ సేవలు అవసరం లేదని చెప్పేవాడు.

వారు పెరిగి పెద్దవారవుతున్నకొద్దీ, తండ్రి తమకి బోధించినట్లుగానే నడచుకోసాగారు. ఇద్దరికీ వివాహాలయ్యాయి. తర్వాత పిల్లలు పుట్టి, ఆ తర్వాత వాళ్ళ పిల్లలకి కూడా పెళ్ళిళ్ళయి మనవలు పుట్టారు. ఓ రోజు అద్దంలో చూసుకున్న ఓ సోదరుడు రెండోవాడితో చెప్పాడు.

"శాస్త్రంలో ఏం చెప్పారో తెలుసా? తల మీద తెల్లవెంట్రుక కనబడినా, శరీరంలో ముడత కనబడినా, మనవడ్ని ఎత్తుకున్నా వెంటనే ఏ కాశీకో వెళ్ళి వానప్రస్థాశ్రమంలో శేషజీవితం గడపాలని. మన నాన్నగారు కూడా అదే చేశారు. కాబట్టి మనమూ కాశీకి వెళ్ళిపోదాం."